క్లుప్తంగా

దంత సంరక్షణపై అవగాహన అవసరం



కార్యక్రమంలో పాల్గొన్న వైద్యులు, చిన్నారులు

కంబాలచెరువు: ప్రతిఒక్కరికీ దంత సంరక్షణ, ఆరోగ్య సమస్యలపై అవగాహన ఉండాలని డెంటల్ సర్జన్ డాక్టర్ విశ్వనాథ్ అన్నారు. స్థానిక ప్రభుత్వాస్పత్రిలోని చిన్నపిల్లల విభాగం డైస్ సెంటర్‌లో గురువారం నోటి ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. డాక్టర్ విశ్వనాథ్ మాట్లాడుతూ, దంతాల సంరక్షణలో అజాగ్రత్త తగదన్నారు. నిత్యం రెండుసార్లు దంతాలను బ్రష్ చేయాలని సూచించారు. నోటి పరిశుభ్రత, పాటించాల్సిన నియమాలు, టెక్నిక్స్‌ను డెంటల్ హైజనిస్ట్ డాక్టర్ సూర్యవర్మ వివరించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ హరిచంద్ర ప్రసాద్, డాక్టర్ మోహన్‌చంద్ర, చిన్నపిల్లల విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ ఇంద్రజ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ క్రాంతిసౌజన్య, డైస్ సిబ్బంది పాల్గొన్నారు.

వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా తీర్మానం చేయాలి

ఏపీఎంఎఫ్‌సీ మాజీ డైరెక్టర్ నిజాం

ప్రకాశంనగర్: వక్ఫ్ బిల్లుకు వ్యతిరేకంగా కర్ణాటక అసెంబ్లీ తీర్మానం చేసినట్టుగానే, కూటమి ప్రభుత్వం ఇక్కడి అసెంబ్లీలో తీర్మానం చేయాలని ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ నిజాం గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్రం ప్రభుత్వం తెస్తున్న ఈ నూతన వక్ఫ్ ఎమెండ్‌మెంట్-2024 సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ఏపీ అసెంబ్లీలో తీర్మానం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. టీడీపీ, జనసేన పార్టీల్లో ఉన్న ముస్లిం మైనార్టీ నాయకులు తమ అధినేతలను ఈ బిల్లుపై నిలదీయాలని కోరారు.

సుంకర స్వామిని ఆదర్శంగా తీసుకోవాలి



సుంకర స్వామిని సత్కరిస్తున్న ప్రముఖులు

రాజమహేంద్రవరం రూరల్: మాస్టర్ గేమ్స్‌లో గోల్డ్ మెడల్స్ సాధించిన సుంకర స్వామిని ఔత్సాహిక క్రీడాకారులు ఆదర్శంగా తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర వైద్య విభాగ ప్రధాన కార్యదర్శి డా.గోరంట్ల రవిరామ్‌కిరణ్ అన్నారు. ఒడిశాలో ఇటీవల మాస్టర్స్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఏడో నేషనల్ గేమ్స్‌లో గోల్డ్ మెడల్స్ సాధించిన సుంకర నరసింహ స్వామిని గురువారం సాయంత్రం బొమ్మూరులోని దోసాలమ్మ ఆలయం వద్ద ఘనంగా సత్కరించారు. బొమ్మూరు సీఐ కాశీవిశ్వనాథ్ మాట్లాడుతూ, సుంకర స్వామి షార్ట్‌పుట్, డిస్క్ త్రో, హేమర్ త్రోల్లో గోల్డ్ మెడల్, జావెలిన్ త్రోలో సిల్వర్ మెడల్ సాధించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మజ్జి పద్మావతి, స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

25న వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం



శ్రీభూ సమేత వేంకటేశ్వరస్వామి

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు వేంకటేశ్వరనగర్‌లో వేంచేసియున్న శ్రీభూ సమేత వేంకటేశ్వరస్వామి 13వ వార్షిక కల్యాణోత్సవం ఈ నెల 25వ తేదీన జరుగుతుందని ఆలయ కమిటీ ఓ ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా ఆ రోజు ఉదయం విశేషపూర్ణాభిషేకం, మధ్యాహ్నం విశేష అన్న సమారాధన, సాయంత్రం కల్యాణోత్సవం జరుగుతాయని వివరించింది. 24వ తేదీ సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు స్వామివారి ఊరేగింపు జరుగుతుందని తెలిపింది.

టయోటా హైరైడర్ మైలేజ్ ర్యాలీ



బహుమతి అందజేస్తున్న ప్రతినిధులు

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్ర ప్రజల విశేష అభిమానాన్ని చూరగొన్న పృథ్వీ టయోటా స్థానిక జైలు రోడ్ షోరూంలో గురువారం టయోటా హైరైడర్ వాహన మైలేజ్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం పృథ్వీ టయోటా షోరూం నుంచి రాజానగరం పిరమిడ్ రెస్టారెంట్ మీదుగా తిరిగి షోరూం వరకూ ర్యాలీ కొనసాగింది. డ్రైవింగ్ నైపుణ్యాన్ని, వాహన మైలేజ్ సామర్థ్యాన్ని నిరూపించినట్టు టయోటా ఏరియా మేనేజర్ చమన్ శర్మ, పృథ్వీ టయోటా సీఈవో కిరణ్‌కుమార్, జీఎం భాను శ్రీనివాస్ తెలిపారు. వారు మాట్లాడుతూ ర్యాలీలో అత్యధికంగా 30.1 కేఎం/పీఎల్ మైలేజ్ వచ్చిందన్నారు. కార్యక్రమంలో పాల్గొని, గెలుపొందిన వారికి ప్రత్యేక బహుమతులు అందజేశారు.

కలం.. గళంతో సామాజిక కాంతులు

నవ్వితే కన్నీళ్లొస్తాయి.. ఏడ్చినా కన్నీరు తప్పదు.. అలాగని ఆనందాన్ని, దుఃఖాన్ని ఒకే గాటన కట్టలేం. మనస్సులోని భావాలను బట్టి భావార్థాలు మారుతాయి. భావోద్వేగాలను బట్టి కవి హృదయం ప్రతిస్పందిస్తుంది. అందుకే కవిత్వంలో నవరస భావాల సమ్మేళనం ప్రస్ఫుటమవుతుంది. కవిత్వం జాలువారే కలం .. కవిత్వాన్ని వినిపించే కవి గళం.. సమాజంలో అభ్యుదయ బాటకు కాంతిపుంజాలవుతాయి.

- సాంస్కృతిక రాజధానిలో లోటు లేని కవులు, రచయితలు
- సాంస్కృతిక సంస్థల ఆధ్వర్యంలో పోటీలు
- నేడు ప్రపంచ కవితా దినోత్సవం



కవులను సత్కరిస్తున్న ఆంధ్రకేసరి యువజన సమితి ప్రతినిధులు (ఫైల్)

సీటీఆర్ఐ: గోదావరి అనగానే కవుల్లో కవిత్వం పొంగుకొస్తుంది. గలగల పారుతున్న గోదారిలా.. అంటూ సినీ కవులు తమ పాండిత్యాన్ని మరీ సానబెడతారు. ప్రకృతిని వర్ణించాలన్నా.. తల్లిప్రేమ గొప్పదనాన్ని చాటాలన్నా.. మానవత్వాన్ని సమాజానికి కళ్లకు కట్టాలన్నా.. కవిత్వానికి మించిన సాధనం లేదు. గోదావరి నీరు తాగిన వారికి కవిత్వం వెన్నతో పెట్టిన విద్య అనే నానుడి నిజం చేస్తూ ఇక్కడ అనేక మంది తమ కవిత్వంతో రాణిస్తున్నారు.

గొప్ప ప్రక్రియ

కవిత్వం ఓ గొప్ప ప్రక్రియ. అందులోని మాధుర్యం సాహితీప్రియులకే తెలుసు. మానవ సంబంధాలు కనుమరుగవుతున్న నేటి తరుణంలో కవులు ఎంతో గొప్పగా బంధాలు, అనుబంధాలపై, సమకాలిక అంశాలపై చక్కని కవితలతో సమాజంలో అంధకారాన్ని పారదోలడానికి కృషి చేస్తున్నారు. పురాతన సాహిత్య రూపమైన కవిత్వాన్ని, కవిని గౌరవించే సంప్రదాయం మన దేశంలో అనవాయితీగా వస్తుంది. అనేకమంది భారతీయ రాజులు కవిత్వాన్నీ, కవులనూ పోషించేవారు.

ప్రపంచ కవిత దినోత్సవం

తొలిసారిగా 18వ శతాబ్దంలో ఐరోపాలో రోమన్ కవి విర్రీన పేరున అక్టోబరు నెలలో కవితా దినోత్సవం నిర్వహించారు. ఆనాటి నుంచి ఇతర ప్రాంతాల్లో కూడా కవితా దినోత్సవం చేయనారంభించారు. 1999లో పారిస్‌లో యునెస్కో 30వ సమావేశం జరిగింది. ఏటా మార్చి 21న ప్రపంచ కవితా దినోత్సవం జరపాలని ఆ సమావేశంలో నిర్ణయించారు.

సామాజిక చైతన్యానికి ఆయుధం



నిశ్శబ్దాన్ని ఛేదించి, సమాజాన్ని చైతన్యవంతం చేసే దిశగా కవిత్వం పురోగమించాలి. జరుగుతున్న అన్యాయాన్ని, రగులుతున్న విధ్వంసాన్ని ఆపే దిశగా ప్రతి కలం ఖడ్గమై.. నిజాన్ని నిర్భయంగా చాటి చెప్పాలి. సొంత గొంతుతో స్వేచ్ఛగా కదలాలి. ప్రపంచానికి మానవత్వం, సమానతను అందించాలి. అంతరించిపోతున్న భాషను, కనుమరుగుతున్న సంస్కృతిని పరిరక్షించుకునే దిశగా ప్రతి కవి కలాన్ని, గళాన్ని సంధించి, భావితరాలకు వెలుగు బాట కావాలి.

– డాక్టర్ తరపట్ల సత్యనారాయణ, సహాయ ఆచార్యులు, తెలుగు శాఖ, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం

ఇదొక ప్రయోగ శాల



ప్రతి ప్రయోగంలో సరికొత్త ఆవిష్కరణలు ఉన్నట్లే, కవిత్వంలోని ప్రతి పదంలో వింతైన శబ్దాలతో, ప్రళయకాల ప్రభంజనంగా, అగ్ని పర్వతంలా, సెగలు కక్కుతూనే ఉంటుంది కవిత్వం. మనిషి మనసు లోతుల్లోంచి, అనుభవం నుంచి వాస్తవాన్ని చూపించేదే అసలు సిసలైన కవిత్వం. పరుగులు పెట్టే జీవనంలో కవిత్వాన్ని ఆస్వాదించే వారికి మానసిక పరిపక్వత, సృజనాత్మకత ఉంటాయి.

– డాక్టర్ పీవీబీ సంజీవరావు, తెలుగు శాఖాధిపతి

హృదయానికి వంతెన



కవిత్వం విన్నా, చదివినా మనసుకు హాయిగా ఉండాలి. ఆ సృజన కొత్త ఆలోచనలకు, అభివృద్ధికీ దారులు పరచాలి. హృదయానికి వంతెన వేయాలి. ఎటువంటి పరిస్థితుల్లోనైనా ధైర్యంతో ముందుకు సాగే శక్తినివ్వాలి. పదాలకు మల్లెల పరిమళం ఉంటుంది. అది గుండెల్లో గుభాళిస్తుంది. దానికి సంగీతంతో జత కలిపితే మాధుర్య ఝురులు కురుస్తాయి.

– డాక్టర్ బీహెచ్‌వీ రమాదేవి, ఆదిత్య డిగ్రీ కళాశాల

కవులు, రచయితలు పెరిగారు



తెలుగు సాహిత్య రంగంలోకి వివిధ కవితా ప్రక్రియలు ప్రవేశించిన కారణంగా దాని రూపం విస్తృతమవ్వడమే కాకుండా, కవులు, రచయితల సంఖ్య బాగా పెరిగింది. అంతే కాదు.. రచనలూ బాగా పెరిగాయి. ప్రభుత్వం ప్రత్యేకించి ఆంధ్ర రాష్ట్రంలో తగిన ప్రోత్సాహం లభించకపోవటం దురదృష్టం. మనిషిని సామాజిక రుగ్మతల నుంచి బయట పడవేయగలిగేది కవులు, కవిత్వం మాత్రమే. కవులను ప్రోత్సహిస్తే వారు మంచి సమాజ నిర్మాణానికి కృషి చేస్తారు.

– ఎస్ఆర్ పృథ్వీ, ప్రముఖ కవి

ఇది ఒక సంజీవని



లలిత కళలో కవిత్వం విశిష్టమైనది. ఏ ప్రదేశంలోనైనా వేదిక అవసరం లేని ప్రక్రియ. లలిత కళల్లో అందుకే దీనికి ప్రథమ స్థానం. మన స్పందనలు, భావావేశం, పదాలలో అక్షర రత్నాలను పొదిగి, మనసుకు హత్తుకునే ఆలోచనల పరంపరలో అవి వ్యక్తం చేసే వీలవుతుంది. భక్తి, జ్ఞాన వైరాగ్య, తాత్విక, దృక్పథాలకు ఆలంబన ఈ కవిత్వం. జానపదాలతో, పల్లె పాటల్లో ప్రజల హృదయాలను రంజింపజేసి, ఆరోగ్య సంపదనిచ్చే సంజీవని.

– ఓబులేసు, కవి

పెన్షన్ల మంజూరుకు 'కూటమి' సాకులు

వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు స్టాలిన్



విలేకరులతో మాట్లాడుతున్న సతీష్‌చంద్రస్టాలిన్

కడియం: కొత్త పెన్షన్ల మంజూరు విషయంలో చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సాకులు చెబుతోందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్ చంద్ర స్టాలిన్ అన్నారు. గురువారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో గతేడాది పెన్షన్ నమోదు యాప్ క్లోజ్ చేశారన్నారు. దాదాపు ఏడాది గడుస్తున్నా ఆ యాప్‌ను కూటమి ప్రభుత్వం ఓపెన్ చేయలేదన్నారు. దీంతో అన్ని అర్హతలు ఉన్నప్పటికీ, లబ్ధిదారులను నమోదు చేసుకునేందుకు అవకాశం లేకుండా పోయిందన్నారు. ఇవేమీ పట్టించుకోకుండా కూటమి నాయకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. జేగురుపాడు గ్రామానికి చెందిన నాగిరెడ్డి సత్తిబాబు బ్రెయిన్ ట్యూమర్ కారణంగా మంచానికే పరిమితమయ్యాడన్నారు. 90 శాతం వైకల్యం ఉన్నట్లు వైద్యులు ధ్రువీకరించినప్పటికీ, పెన్షన్ మాత్రం మంజూరు చేయడం లేదన్నారు. గతేడాది జూన్, అక్టోబర్ నెలల్లో అతడు సదరమ్ క్యాంప్‌లకు హాజరయ్యాడన్నారు. అయినా అతడికి పెన్షన్ మంజూరు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. గత ప్రభుత్వంపై నెపం నెట్టడం సబబు కాదన్నారు. రూ.15 వేల పెన్షన్ పొందేందుకు కడియం మండలంలో 50 మంది వరకు ఉన్నారని, కనీసం వీరికి తొలి ప్రాధాన్యమిచ్చి పెన్షన్ మంజూరు చేయించాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారిని ఆదుకోవడం మాని, ఎదుటివారిపై విమర్శలకు దిగడం తగదని హితవు పలికారు.

చట్ట పరిధిలో సమస్యల పరిష్కారం

'పల్లెనిద్ర'లో అడిషనల్ ఎస్పీ సుబ్బరాజు



తొర్రేడులో పల్లెనిద్రలో ప్రజలతో మాట్లాడుతున్న ఏఎస్పీ సుబ్బరాజు

రాజమహేంద్రవరం రూరల్: గ్రామ సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే, వాటిని చట్ట పరిధిలో పరిష్కరించడానికి కృషి చేస్తానని జిల్లా అడిషనల్ ఎస్పీ(లాఅండ్‌ఆర్డర్) అల్లూరి వెంకట సుబ్బరాజు అన్నారు. బుధవారం రాత్రి తొర్రేడు గ్రామంలో జిల్లా ఎస్పీ డి.నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు ఆయన పల్లెనిద్ర చేశారు. ఈ సందర్భంగా ఏఎస్పీ సుబ్బరాజు ప్రజలతో సమావేశమై, సమాజంలో జరుగుతున్న నేరాలపై అవగాహన కల్పించారు. గ్రామంలో పక్కదారి పట్టిన వ్యక్తుల సమాచారాన్ని ప్రజల నుంచి సేకరించారు. గ్రామ పెద్దలతో మాట్లాడి, వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలపై, బాల్య వివాహాలు, డయల్ 112, శక్తి యాప్, సోషల్ మీడియా, రోడ్డు భద్రతా నియమాలు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. స్థానికంగా జరుగుతున్న చట్ట వ్యతిరేక కార్యకలాపాల సమాచారాన్ని తెలుసుకునేందుకు ఎస్పీ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్టు తెలిపారు. ఆయన వెంట రాజానగరం ఇన్‌స్పెక్టర్ వీరయ్యగౌడ్, ఎస్సై మనోహర్, ఇతర సిబ్బంది ఉన్నారు.

సునీతా విలియమ్స్‌కు విద్యార్థుల అభినందనలు



అభినందనలు తెలుపుతున్న విద్యార్థులు

కంబాలచెరువు: అంతరిక్షం నుంచి భూమికి తిరిగొచ్చిన వ్యోమగామి సునీతా విలియమ్స్‌కు స్థానిక తాడితోటలోని సంహిత డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులు హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ తోట రామకృష్ణ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జి.బాలకృష్ణ, ఎన్ఎస్ఎస్ పీఓలు సీహెచ్ రామకృష్ణ, ఎస్‌కేపీ భాను, పి.హర్షిత సునందిని తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యుని పల్లకీ ఊరేగింపు

సీటీఆర్ఐ: లాలాచెరువు హౌసింగ్ బోర్డు కాలనీలో వేంచేసియున్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రథమ వార్షిక మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. గురువారం ఉదయం హౌసింగ్ బోర్డు కాలనీలో స్వామి పల్లకీ ఊరేగింపు కార్యక్రమాన్ని ధర్మకర్త నండూరి సుబ్బారావు ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. భక్తులు పల్లకీ సేవలో ఉన్న స్వామివారిని దర్శించుకున్నారు. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలు, పుష్పమాలలతో అందంగా అలంకరించారు. పల్లకీ ఊరేగింపులో స్థానిక పెద్దలు, భక్తులు విశేషంగా పాల్గొన్నారు. ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా మూడు రోజులుగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి ఆలయ ప్రధానార్చకుడు అజయ్ కుమార్‌శర్మ, రవిశర్మ ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం, వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్ గుడూరి శ్రీనివాస్, గుడూరి రాధిక తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు. అతిథులకు ఆలయ ధర్మకర్త నండూరి సుబ్బారావు, కుటుంబ సభ్యులు సత్కరించి, జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలను అందజేశారు. అనంతరం జరిగిన అన్నదాన కార్యక్రమంలో సుమారు 2 వేల మంది భక్తులు స్వామివారి ప్రసాదాన్ని స్వీకరించారు.

చోరీ కేసులో నిందితుడికి ఏడాది జైలు

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు పోలీస్ స్టేషన్‌లో ఆరు చోరీ కేసుల్లో నిందితుడైన కొంతమూరు గ్రామానికి చెందిన కొండేటిసాయికి ఏడాది కఠిన కారాగార శిక్ష విధిస్తూ ఆరో ఏజేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి ఎన్.రెడ్డి ప్రసన్న గురువారం తీర్పునిచ్చారు. గత రెండేళ్ల కాలంలో నిందితుడు బొమ్మూరు, పరిసర ప్రాంతాల్లో ఆరు తాళం వేసిన ఇళ్లలో రాత్రివేళ తలుపు పగులగొట్టి, బంగారు ఆభరణాలు, నగదు చోరీ చేశాడు. బొమ్మూరు గ్రామానికి చెందిన ఆనంద్ ప్రకాష్ ఫిర్యాదు మేరకు, అప్పటి బొమ్మూరు సీఐ ఆర్.విజయకుమార్ కేసు దర్యాప్తు చేసి, నిందితుడిని అరెస్టు చేశారు. ప్రస్తుత సీఐ కాశీవిశ్వనాథ్ పర్యవేక్షణలో, కోర్టు కానిస్టేబుల్ డీఎల్ గంగాధరరావు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. విచారణలో నేరాలు రుజువు కావడంతో నిందితుడికి ఏకకాలంలో ఏడాది పాటు కఠిన కారాగార శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. ఏపీపీ ఓలేటి మహాలక్ష్మి ప్రాసిక్యూషన్ తరపున వాదించారు.

ఉద్యోగ భద్రతపై మీటర్ రీడర్ల ఆందోళన

స్మార్ట్ మీటర్లతో ఉపాధి కోల్పోతామని ఆవేదన



పూలే విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న మీటర్ రీడర్లు

రాజమహేంద్రవరం సిటీ: స్మార్ట్ మీటర్ల వల్ల తాము ఉపాధి కోల్పోతామని, తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ విద్యుత్ మీటర్ రీడర్ల సంఘం రాజమండ్రి డివిజన్ (రాజమండ్రి టౌన్, రూరల్) శాఖ డిమాండ్ చేశారు. గురువారం యూనియన్ ఆధ్వర్యంలో గోదావరి గట్టున ఉన్న ఏపీఈపీడీసీఎల్ ఎస్ఈ ఆఫీసు ఎదురుగా ఉన్న మహాత్మా జ్యోతీబా పూలే విగ్రహం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ కార్యదర్శి సురేష్‌కుమార్ మాట్లాడుతూ, పాతికేళ్లుగా పని చేస్తున్న తమకు ఇంతవరకూ ఉద్యోగ భద్రత లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కాంట్రాక్టర్లను నమ్మి, తమకు అన్యాయం చేస్తోందని మండిపడ్డారు. ఎన్నో పోరాటాలు చేసి పీఎఫ్, ఈఎస్ఐ, బ్యాంకు ద్వారా జీతాలు అందే విధంగా సాధించుకున్నామని తెలిపారు. గత 15 ఏళ్లుగా పీఎఫ్, ఈఎస్ఐ పొందుతున్నా, తమకు ఇప్పటివరకూ ఉద్యోగ భద్రత లేకపోవడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారన్నారు. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే తమకు ఇక ఉపాధి ఉండదన్న అనుమానాన్ని వ్యక్తం చేశారు. ఏళ్ల తరబడి ఇదే పని నమ్ముకుని ఉన్న తమకు, ఇప్పుడు 48 ఏళ్ల వయసులో వేరే ఉద్యోగాల్లో ఎవరు తీసుకునే పరిస్థితి లేదన్నారు. తమ సమస్యను సంస్థ సీఎండీ, ఎస్ఈ దృష్టికి తీసుకువెళ్లినట్లు చెప్పారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని, లేకుంటే కుటుంబాలతో రోడ్డున పడతామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాజమహేంద్రవరం అధ్యక్షుడు పిల్లా ప్రసాద్, డివిజనల్ కోశాధికారి బొమ్మనబోయిన రామకృష్ణ, డివిజన్ కార్యదర్శులు కె.సురేష్‌కుమార్, దొంతంశెట్టి మూర్తి, రాజానగరం సెక్షన్ కార్యదర్శి కప్పల రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆహార భద్రతపై జాతీయ అవగాహన సదస్సు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): వాణిజ్య, నిర్వహణ శాస్త్ర విభాగం, మైక్రో బయాలజీ విభాగం, వినియోగదారుల క్లబ్ సంయుక్తాధ్వర్యంలో ఆహార భద్రత-వినియోగదారుల అవగాహన అనే అంశంపై గురువారం స్థానిక ఆర్ట్స్ కళాశాలలో జాతీయ వర్క్ షాప్ నిర్వహించారు. ఆహార రసాయన శాస్త్రం, పోషక విశ్లేషణ శాస్త్రవేత్త డాక్టర్ ఒ.శ్రీనివాసరావు, రీసెర్చ్ కన్సల్టెంట్ డాక్టర్. ఒ.చంద్రప్రసాద్ ఉపన్యాసకులుగా వ్యవహరించారు. ఆహార భద్రత, పోషకాహార లోపం నిలకడ-భవిష్యత్తు దృక్కోణాలు, ఆహార భద్రత-సవాళ్లు, చిక్కులు, కొలతలు అనే అంశాలపై విశదీకరించారు. ఈ సందర్భంగా ఆహార భద్రత ప్రాముఖ్యాన్ని ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర ఆర్కే వివరించారు, కో-ఆర్డినేటర్లు డాక్టర్ ఏఏ అన్నపూర్ణ, డాక్టర్ టి.సోనీ వాణిజ్య, నిర్వహణ, మైక్రో బయాలజీ విభాగాల నివేదికలను సమర్పించారు. కన్వీనర్లు డాక్టర్ పీవీవీ సత్యనారాయణ, డాక్టర్ టి.సుజాత వర్క్ షాపు గురించి వివరించారు. అలాగే ఆహార కల్తీపై అవగాహన కల్పించేందుకు మైక్రో బయాలజీ విభాగం ఫుడ్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి గౌరవ అతిథిగా ఆచార్య ఎన్.ఉదయభాస్కర్, ఇతర అతిథులు వి.రుక్కయ్య, శామ్యూల్‌రాజు తమ సందేశాలు అందించారు. ఈ కార్యక్రమానికి ఆర్గనైజింగ్ సెక్రటరీగా పవన్‌కుమార్ వ్యవహరించగా, వాణిజ్య, నిర్వహణ శాస్త్ర, మైక్రో బయాలజీ అధ్యాపకులు, ఇతర శాఖల అధ్యాపకులు, విద్యావేత్తలు, పరిశోధన పండితులు, పరిశ్రమల వారు, విద్యార్థులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

రాజమహేంద్రవరం సిటీ: వేసవి తీవ్రత దృష్ట్యా శానిటరీ సిబ్బంది ఆధ్వర్యంలో ప్రతి రోజు మజ్జిగ పంపిణీ నిర్వహించే విధంగా చర్యలు చేపట్టినట్లు నగర పాలక సంస్థ శానిటరీ సూపర్‌వైజర్ ఐ.శ్రీనివాస్ తెలిపారు. గురువారం స్థానిక 22, 23 వార్డుల్లో 13వ క్లస్టర్ శానిటరీ సిబ్బంది ఆధ్వర్యంలో మున్సిపల్ శానిటరీ సూపర్‌వైజర్ శ్రీనివాస్ చలివేంద్రం ప్రారంభించి, మజ్జిగ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్-2 కె.రామలింగారెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్-3 సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

23న స్వాతంత్య్ర యోధుల వర్ధంతి సభ

ప్రకాశంనగర్: ప్రముఖ స్వాతంత్య్ర సమరయోధులు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ 94వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 23న స్థానిక సీపీఐ కార్యాలయంలో వారి వర్ధంతి సభ నిర్వహిస్తున్నట్లు న్యాయవాది తోరాటి వసంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. నిత్య జీవితంలో శాస్త్రీయ దృక్పథం-ఆచరణ అనే అంశంపై జన విజ్ఞాన వేదిక నాయకులు డాక్టర్ సీహెచ్ రవికుమార్ ప్రసంగిస్తారని చెప్పారు. నేటి పరిస్థితుల్లో భగత్‌సింగ్ ఆలోచనల ప్రాసంగికత అనే అంశంపై ఎయిమ్స్ విశ్రాంత ఆచార్యులు డాక్టర్ కె.విజయకుమార్ ఉపన్యసిస్తారని తెలిపారు.

సంగీత పాఠశాలలో గాత్ర కచేరి



కచేరిలో పాఠశాల విద్యార్థులు, అధ్యాపకులు

సీటీఆర్ఐ: వయోలిన్ విద్వాంసులు కొక్కొండ సుబ్రహ్మణ్యశర్మ, గాత్ర విద్వాంసులు గరిమెళ్ల బాలకృష్ణ ప్రసాద్ సంస్మరణ సభలో సంగీతంతో నివాళులర్పించడం.. సంగీతానికి వారు చేసిన సేవలను స్మరించుకోవడమేనని శ్రీవిజయశంకర ప్రభుత్వ నృత్య, సంగీత పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.నాగలక్ష్మి అన్నారు. గురువారం స్థానిక శ్రీవిజయశంకర నృత్య, సంగీత పాఠశాలలో విద్వాంసుల సంస్మరణ సభ నిర్వహించారు. ఆనంతరం పాఠశాల విద్యార్థులు వయోలిన్ కచేరి, గాత్ర కచేరి చేయగా, వి.సాయిసురేష్ మృదంగ సహకారం అందించారు. పాఠశాల అధ్యాపకులు ఎం.నరసింహారావు, బి.రవికిరణ్ గాత్ర కచేరికి వయోలిన్‌తో కేటీ సుబ్బరాయన్, మృదంగంతో జీఎల్ కృష్ణమూర్తి సహకరించారు.

రేపు 'సంకల్ప' మెగా జాబ్ మేళా

పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ ప్రశాంతి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి తదితరులు

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): జిల్లాకు చెందిన నిరుద్యోగ యువత సంకల్ప మెగా జాబ్ మేళాకు హాజరై ఉద్యోగాలు సాధించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో సంకల్ప-జాబ్ మేళా పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ జాబ్ మేళాలో 25 ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయని చెప్పారు. వివిధ ఉద్యోగాలకు టెన్త్, ఐటీఐ, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, బీటెక్, ఎంటెక్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంకాం తదితర కోర్సులు పూర్తి చేసిన 19 నుంచి 50 ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులని తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వీడీజీ మురళీ మాట్లాడుతూ, రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి సంస్థ సంయుక్తాధ్వర్యంలో రాజమండ్రి నియోజకవర్గంలోని ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో శనివారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు వివరించారు. అభ్యర్థులకు నేరుగా ఇంటర్వ్యూలు నిర్వహించి, ఎంపిక ప్రక్రియ పూర్తిచేస్తారన్నారు. రిజిస్ట్రేషన్, ఇతర సమాచారం కోసం 99888 53335, 87126 55686, 87901 18349, 87901 17279 నంబర్లలో సంప్రదించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ముఖ్య ప్రణాళికాధికారి ఎ.అప్పలకొండ, జిల్లా పర్యాటక అధికారి పి.వెంకటాచలం తదితరులు పాల్గొన్నారు.

మద్దూరి సేవలు చిరస్మరణీయం

మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు



వీరభద్రరావుకు అవార్డు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే రౌతు తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: స్వాతంత్య్ర సమర యోధుడు, ఆంధ్ర నేతాజీ మద్దూరి అన్నపూర్ణయ్య సేవలు చిరస్మరణీయమని మద్దూరి అన్నపూర్ణయ్య సేవా సమితి గౌరవాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు అన్నారు. మద్దూరి అన్నపూర్ణయ్య జయంతి సందర్భంగా గురువారం స్థానిక ప్రకాశంనగర్‌లోని ధర్మంచర కమ్యూనిటీ హాలులో బుక్ బ్యాంకు ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జాతీయోద్యమంలో మద్దూరి అన్నపూర్ణయ్య కీలక పాత్ర పోషించి, స్వాతంత్య్ర భారత దేశ ఆవిర్భావానికి తన వంతు కృషి చేశారని కొనియాడారు. స్వాతంత్య్ర సమరంలో జైలు శిక్ష అనుభవించి, మద్దూరి అన్నపూర్ణయ్య తన జీవితాన్ని త్యాగం చేశారన్నారు. ఈ సందర్భంగా మద్దూరి అన్నపూర్ణయ్య జీవిత చరిత్రపై రచయిత శ్రీపాద శ్రీనివాస్ రూపొందించిన బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మద్దూరి అన్నపూర్ణయ్య స్మారక పురస్కారాన్ని విశ్రాంత ప్రధానోపాధ్యాయులు వెన్నపు వీరభద్రరావుకు ప్రదానం చేశారు. కాగా మద్దూరి అన్నపూర్ణయ్య పురస్కారాలను మహ్మద్ రఫీఉల్లా బేగ్, ఇంద్రగంటి శ్రీనివాస్, దింటకుర్తి వీరవెంకట సత్యనారాయణ, దీక్షితుల సుబ్రహ్మణ్యం, కురుమద్దాల రామారావు, మరంగంటి కృష్ణమాచార్యులు, అరవ వెంకట రమణకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సాహితీ ప్రముఖులు అశోక్‌కుమార్ జైన్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి, ప్రసాదుల హరినాథ్, అబ్దుల్లా షరీఫ్, అనుపోజు వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.